పెరిగిన వేరుశనగ దిగుబడి

- ఎకరాకు 40 బస్తాలు
- బస్తా ధర రూ.3 వేలు
- అధికారికంగా 400, అనధికారికంగా 100 ఎకరాల్లో సాగు


వేరుశనగ సాగు

ముత్తుకూరు: మండలంలో రబీ సీజన్ కింద సాగు చేసిన వేరుశనగ పంట మంచి దిగుబడులనిస్తోంది. పలు గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, యంత్రాల ద్వారా ముమ్మరంగా నూర్పిళ్లు జరుగుతున్నాయి. ముత్తుకూరు, నారికేళ్లపల్లి, పంటపాళెం, ఈపూరు, దొరువులపాళెం, మామిడిపూడి, పిడతాపోలూరు తదితర పంచాయతీల్లో ఈ సీజన్‌లో 400 ఎకరాల్లో అధికారికంగా, 100 ఎకరాలకుపైగా అనధికారికంగా శనగ సాగు చేశారు. ముఖ్యంగా నారికేళపల్లి, పంటపాళెం పంచాయతీల్లో ఊట దొరువుల కింద అధికంగా సాగు చేపట్టారు. ఇది 110 రోజుల పంట. ప్రస్తుతం ఎకరాకు 40 నుంచి 45 బస్తాల (బస్తాకు 40 కిలోలు) వరకు దిగుబడి వస్తోంది. ముత్తుకూరు పంచాయతీలోని బోడిస్వామికండ్రిగలో రైతులు కొందరు ఎకరాకు 50 బస్తాల దిగుబడి సాధించారు. 40 కిలోల శనగ కాయల బస్తా వారం రోజుల క్రితం సుమారు రూ.3,200లకు అమ్మకం జరిగింది. ప్రస్తుతం బస్తాకు రూ.200లు తగ్గినట్టు రైతులు చెబుతున్నారు.

ధరలు నిర్ణయించేదిలా..

ఒక పద్ధతి ద్వారా వ్యాపారులు శనగ కాయల ధరలు నిర్ణయిస్తారు. మొదట 100 గ్రాముల కాయలను తూకం వేస్తారు. తర్వాత ఒలిచి పప్పులను వేరుగా తూకం వేస్తారు. పప్పులు 75 నుంచి 65 గ్రాముల బరువుంటే మంచి మద్దతు ధర లభిస్తుంది. పప్పులు నాణ్యతగా లేకుంటే ధరల్లో కోత విధిస్తారు.


నూర్పిళ్లు చేస్తున్న కూలీలు


వేరుశనగ కాయల్ని ఎండబెడుతూ..

సాగుకు రూ.80 వేల పైనే..



ఒక ఎకరాలో వేరుశనగ సాగు చేయాలంటే రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు వ్యయం అవుతుంది. ఈ సీజన్‌లో దిగుబడి, కొనుగోలు ధర ప్రస్తుతం బాగుంది. ఖర్చులన్నీ పోగా ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు మిగులుతుంది.

– తిన్నెలపూడి సిద్ధయ్య, రైతు

దిగుబడి బాగుంది



రబీ సీజన్ కింద సాగు చేసిన వేరుశనగ పంట కోతలు జరుగుతున్నాయి. దిగుబడి బాగున్నట్లుగా రైతులు చెబుతున్నారు. కొనుగోలు ధర కూడా ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం ఉన్న ధర తగ్గకుండా ఉంటే రైతులు సంతోషంగా ఉంటారు.

– జ్యోత్స్న రాణి, మండల వ్యవసాయాధికారిణి

క్లుప్తంగా

6 నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు


కోదండరామస్వామి ఆలయం

ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో ఉన్న సీతా సమేత కోదండరామ స్వామి ఆలయంలో ఏప్రిల్ 6వ తేదీ నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు జరుగుతాయని తెలుగు బేరి వైశ్య భక్త బృందం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 14వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో రోజూ ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని బృంద సభ్యులు వెల్లడించారు. శ్రీరామ నవమి సందర్భంగా మామిడిపూడి, పంటపాళెం, డమ్మాయపాళెం, పొట్టెంపాడు, పిడతాపోలూరు, ముసునూరువారిపాళెంలోని ఆలయాలను సిద్ధం చేస్తున్నారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీకి గురైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు గురువారం నమోదు చేశారు. వివరాలు.. టెక్కేమిట్టకు చెందిన వస్త్ర వ్యాపారి చక్రవర్తి.. పొగతోటకు గత నెల 28న వెళ్లారు. ఓ హాస్పిటల్ ముందు తన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను నిలిపి సమీపంలోని దుకాణం వద్దకెళ్లారు. తిరిగొచ్చేసరికి బైక్ కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక


కార్యవర్గాన్ని అభినందిస్తున్న న్యాయవాదులు

గూడూరు రూరల్: గూడూరు కోర్టు హాల్లో గురువారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా సోమిశెట్టి ఉమాశంకర్, ఉపాధ్యక్షుడిగా కె.హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకటకృష్ణయ్య, కోశాధికారిగా ఎస్‌కే వహిద, లైబ్రరీ కార్యదర్శిగా యూసుఫ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ప్రతాప్‌కుమార్, మహిళా ప్రతినిధిగా ఎస్‌కే నాగూర్, కార్యనిర్వాహక సభ్యులుగా నవకోటి, సుమన్, ఏడుకొండలు, పి.సుమన్, మహబూబ్‌బాష, సహాయ కార్యదర్శిగా మార్లెళ్ల శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

ఘనంగా గంధోత్సవం


దర్గాలో పూల చద్దర్ కప్పుతున్న నిర్వాహకులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని హజరత్ అమీర్‌షావలీ గంధోత్సవం ఘనంగా ప్రారంభమైంది. దర్గా కమిటీల వివాదాల కారణంగా తొమ్మిదేళ్లుగా ఆగిపోయిన గంధోత్సవం ప్రజాప్రతినిధుల చర్చలతో ఈ ఏడాది మళ్లీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి శ్రీవారి గ్రంధాన్ని బజారు వీధిలోని దోర్నాదుల చెంచుకృష్ణయ్య నివాసం వద్ద నుంచి సప్పరంపై మంగళవాయిద్యాలు, ఫకీర్ల విన్యాసాలు, బాణసంచా వేడుకల నడుమ పట్టణంలో ఊరేగించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. శుక్రవారం రాత్రి సినీ పాటకచ్చేరి, శనివారం మధ్యాహ్నం అన్నదానం, రాత్రి బుల్లితెర నటులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జూనియర్ కాలేజీలో అడ్మిషన్లు

పొదలకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 7వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, వృత్తి విద్య కోర్సులు ఉన్నాయన్నారు. ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజనులకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

కొడవలూరు: మండలంలోని గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని ఎంపీడీఓ వెంకటసుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఆధార్‌తో పాటు పోగొట్టుకున్న వారూ పొందొచ్చని చెప్పారు. ఏడున కమ్మపాళెం, ఎనిమిదిన కొడవలూరు, తొమ్మిదిన రామన్నపాళెం, పదిన నార్తురాజుపాళెం – 1, 11న తలమంచి, 12న యల్లాయపాళెం – 1లో వీటిని నిర్వహించనున్నామని చెప్పారు. గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్వరితగతిన భవన నిర్మాణ పూర్తి

నెల్లూరు సిటీ: కొత్తూరులో అసంపూర్తిగా ఉన్న డీపీఆర్సీ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న ఈ భవనాన్ని గురువారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. సత్వరమే పూర్తి చేసేలా చూడాలని సూచించారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ


అవార్డు అందుకుంటున్న దృశ్యం

పొదలకూరు: గుంటూరుకు చెందిన అమరావతి ఎడ్యు హబ్ ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి ఒలింపియాడ్ పరీక్షలో పట్టణంలోని అమరావతి పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ప్రతిష్టాత్మక గురుదేవోభవ అవార్డు పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వర్లుకు దక్కింది. బెస్ట్ స్కూల్ అవార్డును కూడా అందుకున్నామని కరస్పాండెంట్ కె.సురేష్ గురువారం తెలిపారు.

భక్తుల కొంగు బంగారం సంగమేశ్వరుడు

- రేపట్నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు
- ముస్తాబవుతున్న ఆలయం


సంగమేశ్వరాలయం

సంగం: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన సంగంలో త్రివేణి సంగమం ఒడ్డునున్న కామాక్షితాయి సమేత సంగమేశ్వరుడు భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. త్రేతాయుగంలో తండ్రి మాట జవదాటని పరుశురాముడు తన తల్లిని గండ్రగొడ్డలితో వధించాడు. తల్లిని చంపిన మహాపాప విమోచనం కోసం పెన్నానది పరివాహక ప్రాంతాల్లో స్వయంగా శివలింగాలను ప్రతిష్టించారు. అందులో భాగంగా సంగంలోని పెన్నానది, బొగ్గేరు, బీరాపేరు కలిసే త్రివేణి సంగమం ఒడ్డున 101వ శివలింగాన్ని ప్రతిష్టించి సంగమేశ్వరుడిగా పరశురాముడు నామకరణం చేసినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. సంగమం అంటే కలయిక అని, కాలగమనంలో నాటి త్రివేణి సంగమమే నేటి సంగం గ్రామంగా మారింది. ఆ తరువాత రెడ్డిరాజులు సంగమేశ్వరుని చెంతనే కామాక్షిదేవి అమ్మవారిని ఆలయాన్ని నిర్మించి కామాక్షిదేవి సమేతుడైన సంగమేశ్వరునిగా నామకరణం చేశారు. ఆ నాటి నుంచి సంగమేశ్వరుడు నిత్యం ధూపదీప నైవేద్యాలను అందుకుంటున్నారు. ఏటా ఏప్రిల్‌లో 13 రోజుల పాటు సంగమేశ్వరునికి అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల ప్రారంభ సమయంలో అందజేసే కొడిముద్దలు తిన్న మహిళలకు సంతానం కలుగుతుందనేది భక్తుల నమ్మకం. అందుకే జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు బ్రహ్మోత్సవాలకు తరలివస్తుంటారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు.

బ్రహ్మోత్సవాలిలా..

ఏప్రిల్ 5న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 6న శేష వాహనోత్సవం, 7న అశ్వ వాహనోత్సవం, 8న సింహ వాహనోత్సవం, 9న పులి వాహనోత్సవం, 10న రావణ సేవ, 11న నందిసేవ, 12న రథోత్సవం, పురుషామృగవాహనం, 13న సాయంత్రం గిన్నెభిక్ష, రాత్రికి కల్యాణోత్సవం, 14న సాయంత్రం అలకలతోపు, రాత్రి ధ్వజాఅవరోహణం, 15న సాయంత్రం గంధపడి ఉత్సవం, రాత్రి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈఓ రఘురామయ్య తెలిపారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



వెంకటాచలం: మండలంలోని సరస్వతీనగర్ వద్ద నున్న యూత్ ట్రైనింగ్ సెంటర్లో గురువారం గిరిజన మత్స్యకారులకు సైకిళ్లు, వలలు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన మత్స్యకారులకు అండగా ఉండాలనే ఆలోచనతో రూ.10 వేల విలువైన సైకిళ్లు, వలలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

వ్యక్తిపై దాడి

పొదలకూరు: మండలంలోని నావూరుపల్లి గ్రామానికి చెందిన గుది రాధాకృష్ణయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన నాగరాజు గురువారం దాడి చేసి గాయపరిచాడు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. ధాన్యం ఆరబెట్టుకునే స్థలం విషయంలో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. దీంతో నాగరాజు ఇటుకరాయితో రాధాకృష్ణయ్యపై దాడి చేయగా స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సీసీలు, వీఓఏల విచారణ

కలువాయి(సైదాపురం): కలువాయి మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇటీవల షోకాజ్ నోటీసులు అందుకున్న ఇద్దరు సీసీలు, మెమోలు అందుకున్న కుల్లూరు వీఓఏలను బుధవారం నెల్లూరులో ఆర్డీఏ పీడీ నాగరాజు కుమారి విచారించారు. ఈ విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. కొరమేను చేపల పెంపకంపై కలువాయిలో పనిచేస్తున్న ఏపీఎం, ప్రస్తుత ఎఫ్‌పీఓసీసీలను కూడా విచారించినట్టు సమాచారం. పొదుపు గ్రూపు సభ్యులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ సంఘబంధ నిధులు అవకతవకలపై వెలుగు కుల్లూరు వీఓఏ చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు మెమో జారీ చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): స్నేహితుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడ్ని దర్గామిట్ట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఖుద్దూస్‌నగర్‌కు చెందిన ఆసిఫ్ తన స్నేహితులతో కలిసి మాగుంట లేఅవుట్లోని ఓ లాడ్జికి సోమవారం వెళ్లారు. స్నేహితుల్లో ఒకరైన సాబీర్ మద్యం మత్తులో ఆసిఫ్‌తో గొడవపడ్డారు. ఇద్దరూ నెట్టుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన సాబీర్ అన్న షఫీవుద్దీన్ కత్తితో ఆసిఫ్ పొట్టలో బలంగా పొడిచారు. ఇంకా బలంగా పొడవాలంటూ సాబీర్ ప్రోత్సహించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుల్లో ఒకరైన షఫీవుద్దీన్‌ను అరెస్ట్ చేశారు.

జీరో వేస్ట్‌పై వ్యాపారులకు అవగాహన


మాట్లాడుతున్న కమిషనర్ బాలకృష్ణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జీరో వేస్ట్‌పై మార్కెట్ వ్యాపారులకు అవగాహన కార్యక్రమాన్ని పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలకృష్ణ మాట్లాడారు. కూరగాయల చెత్తను రోడ్లపై కాకుండా చెత్త బుట్టల్లోనే వేయాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా రీసైక్లింగ్ చేసేందుకు అవకాశమున్న వాటినే వినియోగించాలని కోరారు. మార్కెట్‌ను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత వ్యాపారులదేనని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల ప్రకటన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల కమిటీలను గురువారం ప్రకటించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను జారీ చేసింది.

- బుచ్చిరెడ్డిపాళెం మండల వైస్ ప్రెసిడెంట్లుగా వినోద్‌కుమార్, శివకుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా మోహన మురళీకృష్ణ, వెంకయ్య, హరికృష్ణ, ట్రెజరర్ గా తిరుమలేష్‌ను నియమించారు. సెక్రటరీలుగా రాంబాబు, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హరిరెడ్డి నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాము, మదన్, అశోక్, హరి, మస్తానయ్య, కార్తీక్‌రెడ్డి, బుజ్జమ్మ, రమణి, దయాకర్, రమణమ్మ, శ్రీను, సుబ్బమ్మ, కృష్ణయ్య, ప్రభాకర్, ప్రతాప్‌ను నియమించారు.
- **విడవలూరు:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడవలూరు మండల వైస్ ప్రెసిడెంట్లుగా బెల్లంకొండ శ్రీధర్, గండవరపు వివేక్, జనరల్ సెక్రటరీలుగా మాధవయ్య, దాసరి వెంకటేశ్వర్లు, ఆవుల సుధీర్, ట్రెజరర్‌గా కొండూరు శ్రీనివాసులు, సెక్రటరీలుగా నాటారు చంద్రయ్య, మోర్ల మల్లికార్జున, ప్రళయ కావేరి బాషా, పైడిమాని అంకబాబును నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కాయల సందీప్, దాసరి మల్లికార్జున, నిమ్మల రామ్మోహన్, కొల్లపూడి మహేష్, ఎల్లు స్టాలిన్‌బాబు, అక్కయ్యగారి బాబులు, చేపూరి కమలాకర్, నాగెళ్ల శ్రీనివాసులు, బండ్ల వెంకయ్య, వెంకట్రావు, దక్కా హరేంద్ర, మోచర్ల విజయచంద్ర, మిట్టా అంకయ్య, పొన్న సుధాకర్, తులసింగారి మోహన్ నియమితులయ్యారు.
- **కొడవలూరు:** పార్టీ మండల ఉపాధ్యక్షులుగా బండి పెంచలయ్య, యేకొల్లు యుగంధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పెనాక సుభాష్‌రెడ్డి, నంబూరి ప్రసాద్, డేగా శివప్రసాద్‌రెడ్డి, కోశాధికారిగా గరిక మస్తానయ్య, కార్యదర్శులుగా తమ్మిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, నలబాయి కామాక్షి, నెలవాయి మాణిక్యరావు, దేవన బోయిన నాగేంద్ర, రాయపు వేణును నియమించారు. కార్యవర్గ సభ్యులుగా జూటూరు వెంకటకృష్ణారెడ్డి, బచ్చు సుప్రియ, కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, గాదం శ్రీనాథ్‌రెడ్డి, పసుపులేటి యోగానందీశ్వరరావు, వల్లాపురం నవీన్, పొగలూరు కామేశ్వరి, కుంకాల శివప్రసాద్‌రెడ్డి, కరేటి వేణు, చలంచర్ల మేఘనాథ్, కరేటి శ్యామ్‌సుందర్‌రెడ్డి, సలీమ్, పోశం వెంకటేశ్వర్లు, షఫీ, గంగపట్నం జనార్దన్‌రెడ్డి నియమితులయ్యారు.
- **ఇందుకూరుపేట:** పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్లుగా నీరుకట్ల శ్రీనివాసులు, బాలబోయిన కృష్ణయ్య, జనరల్ సెక్రటరీలుగా దండిగుంట ఫణీంద్రనాయుడు, గాలి ప్రసాద్, నాయుడు సురేష్, ట్రెజరర్‌గా రవి, సెక్రటరీలుగా పిడూరు సునీల్‌కుమార్‌రెడ్డి, పరంధామిరెడ్డి, మైపాడు రామయ్య, అర్జున్ తులసీరామ్, చిల్లకూరు విజయ్‌కుమార్‌ను నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గౌస్‌బాషా, రమ్య, నెల్లూరు రమణయ్య, పక్కీరయ్య, జంపాని వేణుగోపాల్, బత్తిన నిరంజన్‌రెడ్డి, దేవిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, సుబ్రహ్మణ్యం గంగపట్నం, వెంకటేశ్వర్లు, చెంచమ్మ, జలీల్, మైపాడు శీనయ్య, గుడి విజయ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు నాగేశ్వరరెడ్డి, పాముూరు రమణారెడ్డి, సుధాకర్, బత్తిన సుమన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి నియమితులయ్యారు.

లైటింగ్ బోర్డుల పైనా బాదుడే..!

- దుకాణాలపై కొత్తగా పన్ను విధింపు
- ఇదేమి చోద్యం అంటున్న వ్యాపారులు
- రూ.ఆరు వేల వరకు వసూలు



ట్రంక్ రోడ్డులోని షాపుల ముందున్న లైటింగ్ బోర్డులు

నెల్లూరు(బారకాసు): సంపద సృష్టిస్తా.. అదే నా లక్ష్యం అంటూ సీఎం చంద్రబాబు తరచూ ఊదరగొడుతుంటారు. అయితే పన్నుల మోత మోగించి.. దాని ద్వారానే ఆయన సాధించనున్నారనే అంశం కూటమి ప్రభుత్వ చేష్టలతో స్పష్టమవుతోంది. ఇప్పటికే పన్నుల పెంపుతో సతమతమవుతుండగా, తాజాగా వీరి కన్ను దుకాణాలపై పడింది. లైటింగ్ బోర్డులకు పన్ను విధించనుండటంతో బెంబేలెత్తడం వ్యాపారుల వంతవుతోంది. ఎక్కడో మహానగరాల్లో అమల్లో ఉన్న ఈ విధానాన్ని నెల్లూరు నగరపాలక సంస్థకూ తీసుకురావడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

వసూలు ఇలా..

నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. దీనికి తోడు దుకాణాలు, షాపింగ్‌మాళ్లు, ఆస్పత్రుల సంఖ్య పెరుగుతోంది. చిన్నబజార్, పెద్దబజార్, ట్రంక్ రోడ్డు, కాపువీధి, మినీబైపాస్, మాగుంట లేఅవుట్, పొదలకూరురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట, బాలాజీనగర్, పొగతోట, రంగనాయకులపేట, సంతపేట తదితర ప్రాంతాల్లో దుకాణాలు, షాపింగ్ మాళ్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. తమ దుకాణాల పేర్లు ప్రజలకు కనిపించేలా నేమ్‌బోర్డులను ఎంతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి వేళ కనిపించేలా ఎల్‌ఈడీ లైటింగ్‌నూ అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటి వరకు అంతా బాగానే ఉన్నా, తాజాగా నగరపాలక సంస్థలో లైటింగ్ బోర్డులున్న ఆయా దుకాణాలకు బోర్డు సైజును బట్టి రూ.రెండు వేల నుంచి రూ.ఆరు వేల వరకు పన్నును టౌన్ ప్లానింగ్ అధికారులు ఏడాదికోసారి వసూలు చేయనున్నారు.

ఈ పన్నేంటి బాబోయ్..

ప్రభుత్వ నిబంధనల మేరకు ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్, కమర్షియల్ ట్యాక్స్ ఇలా అన్ని చెల్లిస్తూ తమ వ్యాపారాలను సాగించుకుంటున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వ నిబంధనల మేరకు లైటింగ్ బోర్డులకు పన్ను కట్టాలని నోటీసులను జారీ చేయడంపై వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ప్రశ్నిస్తే ఇబ్బందులు ఏర్పడతాయనే భయంతో గత్యంతరం లేక వీటిని చెల్లించాల్సి వస్తోంది. అసలే వ్యాపారాలు అంతంతమాత్రంగా జరుగుతున్న తరుణంలో వీటిని చెల్లించాలని ఒత్తిడి చేయడం తగదని పేర్కొంటున్నారు. తమకు మంచి జరుగుతుందనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించామని, అధికారంలోకి వచ్చాక ఇలా పన్నుల మోత మోగించడం తగదని వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటివేవీ లేవనే అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. కాగా ఈ అంశమై టౌన్‌ప్లానింగ్ విభాగ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణును సంప్రదించగా, ప్రభుత్వ నిబంధనల మేరకు.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే దుకాణాలకున్న అదనపు లైటింగ్ బోర్డుల సైజును బట్టి పన్ను విధించి వసూలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లలోనూ ఇదే తరహాలో పన్నులను వసూలు చేస్తున్నారని బదులిచ్చారు.

బిల్లుల చెల్లింపు సరళతరం





బిల్లులో పొందుపర్చిన క్యూఆర్ కోడ్

- విద్యుత్ వినియోగదారుల ఇక్కట్లకు చెక్
- క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చిన ఎస్పీడీసీఎల్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లుల చెల్లింపులను సరళతరం చేయాలనే ఉద్దేశంతో క్యూఆర్ కోడ్‌ను ఎస్పీడీసీఎల్ అందుబాటులోకి తీసుకొచ్చింది. బిల్లులను చెల్లించేందుకు గానూ కొందరు వసూలు కేంద్రాలకు వెళ్తుండగా, మరికొందరు ఆన్‌లైన్ విధానాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో డిజిటల్ చెల్లింపులు జరిపే వినియోగదారులు కొంతకాలంగా ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితరాల ద్వారా జమచేసే ప్రక్రియను నిలిపేసి, ఎస్పీడీసీఎల్ యాప్‌ను సంస్థ ప్రవేశపెట్టింది. అయితే ఇది సక్రమంగా పనిచేయకపోవడం, వినియోగం కష్టతరమైంది. ఫలితంగా చెల్లింపుల్లో చాలా జాప్యం జరుగుతోంది. ఈ తరుణంలో ఈ ఇక్కట్లకు చెక్ పెట్టేందుకు గానూ క్యూఆర్ కోడ్‌ను ఎస్పీడీసీఎల్ ఈ నెల ఒకటిన అమల్లోకి తీసుకొచ్చింది. వినియోగదారులకు ఇచ్చే బిల్లులోనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించి అందజేస్తున్నారు. ఫలితంగా ఇబ్బందులు కొంతమేర తీరాయి. బిల్లులో పొందుపర్చిన క్యూఆర్ కోడ్‌ను ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా స్కాన్ చేసి నగదును చెల్లించే అవకాశం ఏర్పడింది. కాగా బకాయిల్లేని వారికే ఈ తరహాలో బిల్లు ప్రస్తుతానికి జారీ అవుతోంది.